
కథ

# చరిత్ర పాపాలు

## నవులూరి వెంకటేశ్వరరావు



నీచ్ (Nietzschi):
శతాబ్దాల విజ్ఞతే కాదు,
వాటి ఉన్మాదమూ మనలో చోటు
చేసుకుంటుంది. వాటి వారసత్వం
ప్రమాదభరితం.

ఎడ్డెమంటే తెడ్డెమనే భాష్యం, ఆంగ్లదినపత్రిక పంక్తులమీద ఆర్యుల గుర్రాల్లా చూపులను పరిగెత్తిస్తున్నాడు. హోటల్ లాంజ్‌లో మెత్తటి సోఫాలో వంకా కింద, కడుపులో చల్ల కదలకుండా కూర్చుని, చదవటం అయిన తర్వాత, సోఫా వెనక్కు చేరవడి వ్యంగ్యం నిండిన కళ్లతో దళసరి కళ్లజోడు గుండా చూస్తూ వ్యాఖ్యానిస్తాడు. ఏ విషయం మీదనైనా కావచ్చు: చరిత్ర, ప్రభుత్వం, రాజకీయాలు, ధనవంతులు, నవీన మేధావి వర్గం, దారిద్ర్యం... అతను నోరు తెరిస్తే సినిసిజం జాలువారుతుంటుంది. దానిలో తడవని అంశం ఆకాశం కింద లేదు.

మొన్న, రైల్లో, "నీవు అలా మారటానికి కారణాలేమిటి?" అడిగాడు కస్తూరి. "చరిత్రలో వెదుకు" అన్నాడు భాష్యం ఎనిగ్మటిక్‌గా, డిప్ టీ చప్పరిస్తూ. ఇంకేమైనా చెబుతాడేమోనని ఎదురుచూశాడు కస్తూరి. మౌనంగా, పై బెర్త్ ఎక్కి పడుకున్నాడు పెద్ద నిద్రపోయేవాడిలా. మామూలుగానే వాడు క్రానిక్ ఇన్‌సోమ్నియాక్, రైల్లో నిద్రపట్టి చస్తుందా?

రిసెప్షన్ కౌంటర్లో ఒక స్త్రీ, ఒక పురుషుడు ఎవరితోనో అతి వినయంగా మాట్లాడుతున్నారు. మోగే ఫోన్లు ఎత్తి అతి మధురంగా సంభాషిస్తున్నారు. గంటలకొలది అంత వినయం, నమ్రత నటించటం ఎంత కష్టం! వాళ్లు ధూర్తులు కాదు. అది వాళ్ల ఉద్యోగ 'ధర్మం'. తాము మాత్రం ఉద్యోగరీత్యా కొన్ని పనులు ఇష్టంగానే చేస్తున్నారా? శీలం (ఒకనాడు సొంత సొత్తని చెప్పుకున్న) ఆధ్యాత్మిక వైఖరి రెండూ లేని సంస్కృతిలో బతకటం శాపమే. నిన్న రాత్రి, ఒక స్కాచ్ సీసా, కొత్త వందరూపాయల కట్టలున్న తోలు సంచీ, (తాగి తాగి ప్రజా ధనం మెక్కి మెక్కి) ఎండిన ప్రభుత్వాధికారికి నైవేద్యం పెట్టి ప్రసన్నం చేసుకున్నారు. వాడు నిజాయితీపరుడు, లంచం తిని మోసం చేయడు. "మడి కట్టుకుని చేశావా, ఒళ్లు కుదువపెట్టి చేశావా అన్నది కాదు, ఆ పని సాధించావా లేదా అన్నది ముఖ్యం" అంటాడు ఎమ్‌డి. అతను యాజమాన్య పాఠాలు భారతదేశంలోనే నేర్చాడు. నిజానికి ఒళ్లు కాదు తాము కుదువ పెడుతున్నది, దానికన్నా "విలువైంది".

"రాత్రికి తిరుగు ప్రయాణం చేసేలోపు వేరే పన్లేం లేవుకదా, భీమునిపట్నం చూసొద్దాం" పేపరు మూస్తూ భాష్యం అన్నాడు.

వార్తా పత్రికలో భాష్యం పట్టించుకోదగిన అంశాలు లేనట్లున్నాయి, సంతోషం.

"ఏ కొత్త ఊరు మనం కలిసి వెళ్లినా, 'దేశంలో ఏ ఊరు చూసినా ఒకేలా ఉంటుంది, కాంక్రీటు, గ్లాసు, మురికీ చెత్త, పొగ, క్షణ క్షణం పెరిగే జనాభా ఇవే గదా కనిపించేది,' అంటుంటావు గదా... భీమునిపట్నం మీద మమకారం ఎందుకు కలిగినట్లు?" కస్తూరి అడిగాడు.

మడిచిన వార్తాపత్రికను ఎడం చేత్తో పట్టుకుని దాన్ని కుడిచేత్తో బుజ్జగిస్తున్నట్లో, మందలిస్తున్నట్లో మూడుసార్లు కొట్టాడు. అతని అసలు ఉద్దేశం అర్థం అయింది కస్తూరికి. అతను వార్తాపత్రిక చదివాడు.

"విశాఖ ఉత్సవ్ పేరుతో పర్యాటక ప్రదేశాల గురించి డప్పు కొట్టి చాటుతున్నారు. 'స్టేజీల పైకి కిందికి 'ప్రజా ప్రతినిధులు', మంత్రులు, అధికారులు కప్పల్లా గెంతుతున్నారు, బెక బెకమంటూ, వ్యాపార సంస్కృతిలో చావును కూడా ఆకర్షణీయంగా ప్యాక్ చేసి, ప్రచారం చేస్తాంగదా. డచ్ సమాధులు, డచ్ సమాధులు అంటున్నారు. అవి ఒకసారి చూసొద్దాం."

"ఏమిటి వాటి ప్రత్యేకత?"

"ఇటు ప్రాంతం నాకూ కొత్తే. వెళ్లి చూస్తే తెలుస్తుంది. తీరా వెళ్లిన తర్వాత ఆశాభంగం అయితే నన్ను తిట్టక. ఏదైనా, దాని గురించి తెలీనంతవరకూ ఏదో ఆసక్తి మన మనసును పీకుతుంటుంది. తెలిసిన తర్వాత రాజుగారి ఏనుగు అపానవాయువులా తుస్ మనిపిస్తుంది."

"మా అమ్మానాన్నా బతికే ఉన్నారు. అందు కని నేను శ్మశానానికి, గోరీల దొడ్డిలోకి రాకూడదు."

"లోపలికి రావద్దులే, బయటనే నిలబడకూడదు కానీ సముద్రాన్ని చూస్తూ. అమ్మా, నాన్నా బతికి వున్నవాళ్లు సముద్రాన్ని చూడవచ్చని శాస్త్రంలో ఉంది కదా?"

సోఫాలో నుంచి గదిలోకి వెళ్లటానికి ఇద్దరూ లేచారు.

"కస్తూరీ, చరిత్రలో మనస్థానం ఏమిటంటావ్? ముఖరహితంగా, గుంపులో, గుంపుతో వందేళ్లు ఎలాగో ఒకలాగే జీవించి పాడెక్కడమేనా? మన వారసులలో మూడవతరం వారైనా మన గురించి చెప్పుకుంటారంటావా?" లిఫ్టులో దిగుతున్నప్పుడు అన్నాడు భాష్యం.

"మంచిదో, చెడుదో చరిత్ర గతిని మార్చేపని చేయగలిగితే చెయ్యి నీపేరు నిలిచిపోతుంది. ఎవ్వరం, చరిత్రలో ఒసామాలా నిలిచిపోవాలని మాత్రం కోరుకోం!"

"ఒసామాని ఆరాధించేవాళ్లూ ప్రపంచంలో అనేకులు ఉన్నప్పుడు అతనిలా ఉండాలని కోరుకునేవాళ్లూ ఉంటారు. మహమ్మద్ ఘోరీని మనం దుర్మార్గుడిగా భావించి, ద్వేషించవచ్చు, కేవలం 55 సంవత్సరాల చరిత్రను మాత్రం గుర్తించి, ఆమోదించే పాకిస్థాన్‌లో ఘోరీ మహా యోధుడు. భారతదేశానికి ఎక్కుపెట్టి ఉంచిన క్షిపణిది అతని పేరే."

"అసలు మనిషికి పేరు రావాలని, చరిత్రలో నిలిచిపోవాలని తాపత్రయం ఎందుకు?"

"తనను తాను అధికంగా ప్రేమించుకోవటంవలన. తనను తాను ఎక్కువగా అంచనా వేసుకోవటం వలన."

మరో గంటలోపు టాక్సీ మాట్లాడుకుని కూర్చున్నారు. దారిలోనే ఉన్నాయి కాబట్టి తొట్లకొండ, ఎర్రమట్టి దిబ్బల వద్ద మజిలీ చేయదలుచుకున్నారు. విశాఖనుంచి, భీమిలీ అని కూడా పిలువబడే భీమునిపట్నానికి సముద్రతీరం పొడవునా వేసిన 25 కిలో మీటర్ల రోడ్డు మీది ప్రయాణం ఆహ్లాదకరం.

పదే పదే హారను మోగించుతూ శకటాన్ని జాతీయరహదారి చేర్చి, ఇసుక తోట దగ్గర మలుపు తిప్పి, మువ్వలవాని పాలెం జంటరహదారి పైన పరిగెట్టిస్తూ ఒకడిని బలి తీసుకోబోయి, మొత్తం మీద సముద్రతీరపు రోడ్డుకు తీసుకెళ్లాడు డ్రైవరు. రాత్రో, ఈ ఉదయాన్నో ఔషధం సేవించిన సారథి కంపుకొడుతూ, తన కంపును తానే అసహ్యించుకుంటున్నట్లు క్యాకరించి కళ్లెలు కళ్లెలుగా ఉమ్ముతున్నాడు బండి నడుపుతున్నంతసేపూ.

రుషికొండను దాటి, తొట్లకొండదరి చేరారు. ఎడమవైపు మలుపుతిప్పు, ఇదంతా తనకు కొట్టిన పిండే అన్నట్లు కొండెక్కించాడు, కొత్తగా వేసిన నల్లటి రోడ్డు మీదినించి, కొండ అంత ఎత్తుగా లేదు. దీనిమీద 2,200 సంవత్సరాలకు పూర్వం బౌద్ధారామం ఉండేది.

"బౌద్ధులు దీన్ని ఎన్నుకోవడంలో తేలిగ్గా ఎక్కిదిగవచ్చు అన్న కారణం కూడా ఉండి వుంటుంది. తూర్పున విశ్వరూప దర్శనం ఇస్తున్న బంగాళాఖాతం, దాని దూరపు అంచును కలిపే ఆకాశం, అక్కడ రోజూ లేచే సూర్యుడు (అన్నట్లు సూర్యుడు ఉదయించడు, అస్తమించడు అని ఛాందోగ్యోపనిషత్తులో అన్నారిష) ఓహ్! ఈ పరిసరాలలో, లౌకిక జీవితాన్ని పరిత్యజించిన వాళ్లు, లౌకిక జీవితంలో కొట్టుమిట్టాడుతున్న వాళ్లనుంచి భిక్ష పొందుతూ, చీకూ చింతాలేని జీవితాన్ని గడిపి ధన్యులయ్యారు. ఇంతటి చక్కని అవకాశం ఉంటే నేనూ శిరోముండనం చేయించుకుని ఇక్కడే ఉండిపోతా," భాష్యం అన్నాడు బట్టతల నిమురుకుంటూ.

కారు ఆగింది. అడ్డుగా, కర్కశంగా, ఇనుపముళ్ల కంచె కట్టారు శిథిల బౌద్ధారామంలో. పక్కనుంచి దారివుందని చెప్పాడు కాపలాదారు. నాగరికత ఏనాడో మరుగున పడిపోయిన స్థలంలో అది తిరిగి దర్శనం ఇస్తోంది వాహనాలు, అందంగా అలంకరించుకున్న పిన్నలు, పెద్దలు, సందర్శకుల అవసరార్థం చేపట్టిన పనులు. తూర్పుకు తిరిగి, కంచె పక్కనుంచి నడిచి పశ్చిమంగా వచ్చారు. అనేక ఆకృతులలో ఇటుక కట్టడాలు ఉన్నాయి. ఇళ్లకు ఇటుక బేస్‌మెంట్లు వేసినట్లు. దొరికిన కొన్నింటినీ పురావస్తుశాలకు మళ్లించగా అక్కడచూచి అబ్బురపడే శిథిల వస్తువులు లేవు. కొండపై, రాళ్లలో తొలిచిన తొట్లలో నీరు నిలిచి వుంది, పాచి పట్టి వుంది. కొండదిగి వెళ్లి చుట్టుపక్కల నుంచి నీరు సంవత్సరం పొడవునా తెచ్చుకునే వీలులేదు. అందుకే కురిసే వర్షాన్ని కురిసినట్లు ఆ తొట్లలో నిలువ ఉంచుకుని, శుద్ధి చేసుకుని తాగేవారు భిక్షువులు. చదును తీసిన రాళ్లతో కారిడార్లు నిర్మించుకున్నారు. చక్కటి ప్రణాళికననుసరించి ఆ ఆరామంలో వివిధశాలలు నిర్మించారన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. కట్టడాల నిండా చెత్తా చెదారం. (బౌద్ధులు వదిలి వెళ్లింది కాదు. అలా వదిలి వెళ్లుంటే దానికీ పురావస్తు విలువ చేకూరి వుండేది). పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి వున్నాయి. వాటిలో విరిగిన రాతి దూలాలు, స్థంభాలు పడి ఉన్నాయి. వాటి మీద మనుషుల రూపాలేవో చెక్కి వున్నాయి. కళ్లజోడును ముక్కు పైకి ఎత్తి కాసేపు, అరంగుళం జార్చి కాసేపు చూశాడు భాష్యం. చెక్కిన రూపాలలో కళాత్మకత లేదు, చెక్కటం సంపూర్ణంగా రాని శిల్పి పని అది. ఆధ్యాత్మిక చింతనలో మునిగిన వాళ్లకు కళ అక్కరలేదు. వదిలేయాల్సిన కోరికల జాబితాలో కళా ఒకటయ్యుంటుంది.


"ఆ విరిగిన స్థంభం మీది శిల్పం ఆడమనిషిలా వుందే," కస్తూరి అన్నాడు.

"ఏ మతానికి చెందిన సన్యాసులకైనా ఆడరూపాలతో పని ఉండకపోదు."

## మసాలాలు లేని ఆహారంతో చర్మానికి రంగు

కొందరికి, తాము తెల్లగా వున్నా, ఎండలో తిరగటం వల్ల నల్లబడిపోతున్నామని చాలా దిగులుగా వుంటుంది. నిమ్మరసాన్ని గ్లిజరిన్‌తో కలిపి మెడ చుట్టూ, మోచేతులకు పూసుకుంటే ఈ నల్లదనం పోతుంది. ఖీరాలను, దోసకాయలను చక్రాల్లా తరిగి కళ్ల మీద పది నిముషాల పాటు, ఉదయం, సాయంకాలం పెట్టుకుంటే కళ్ల చుట్టూ వున్న నలుపు తగ్గిపోతుంది. మసాలాలు లేని పూర్తి శాకాహారం, తాజా కూరగాయలు, పళ్లు తీసుకోవటం వల్ల తప్పకుండా రంగు వస్తుందని న్యూట్రిషియన్లు అంటున్నారు. పసుపు, పచ్చి పాలు, సెనగపిండి ముద్దగా కలిపి వారానికి రెండు సార్లు ముఖానికి పట్టించుకుని, పదిహేను నిముషాల తరువాత చల్లని నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేసినా ముఖానికి రంగూ, కాంతీ వస్తాయి.

ఎస్.



అతని భావం కస్తూరికి అర్థం కాలేదు. అది ఆడబొమ్మే అని అన్నట్లూ, కాదు అన్నట్లూ, అవును అని ఒప్పుకుంటూ సన్యాసుల శీలంపై వ్యాఖ్యానించినట్లా? బౌద్ధాలయాలను లంజదిబ్బలని ప్రజలు నిర్దేశించేవారని, బౌద్ధ సన్యాసినులను ఒకప్పుడు స్వామిని యని భూషించేవారని, స్వామిని యను పదమే సానిగా మారి నింద్యార్థముతో వాడబడజొచ్చిందని చదివాడు కస్తూరి. కోరికల అణచివేత విస్ఫోటానికి దారితీస్తుంది. కోరికలు మన దుఃఖానికి కారణం అని తెలుసు. మత మార్గంలో నడిచినంత మాత్రాన వాటిని జయించడం సాధ్యపడే విషయం కాదు.

"నెగటివ్ విషయాలు మనల్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి. కదా, భాష్యం?"

"బ్రహ్మజ్ఞానానికే నేతి, నేతి అనాలి. నాగార్జునుడి శూన్యవాదం, శంకరుడి మాయావాదం 'కాదు, లేదు' అన్న కాళ్లమీదే నిలబడింది. బౌద్ధం ఆ కోవదే గదా. కీడు ఎంచి, మేలు ఎంచుతాం."

అక్కడి కాపలాదారు, గైడ్ పాత్రకూడా పోషిస్తున్నాడు, ఉదరపోషనార్థం. ఎవరో ఉత్తర హిందూస్థానం వాళ్లకు వచ్చీ రాని హిందీ ఆంగ్లాల మేలు కలయికతో ఆ స్థల ప్రాముఖ్యతను మనసుకు హత్తుకునేలా చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. ఎంతలా అది హృదయానికి హత్తుకుంటే అంతలా వాళ్లు జేబు లోతులోకి చేయి వెళుతుంది. భాష్యం, కస్తూరి వాళ్ల దగ్గరికెళ్లారు. వివిధ దేశాల బౌద్ధులు ఆరామానికి వచ్చారని, కొందరు ఇక్కడే నిర్యాణం చెందారని గర్వంగా చెబుతున్నాడు. ఆ గర్వానికి కారణం వాళ్లు 'ఇక్కడ' మరణించడమే, 'ఇక్కడికి' రావటమో, 'విదేశీయులను' కూడా ఈ చోటు ఒకనాడు ఆకర్షించి ఉండటమో.

"భిక్షువైనా, బాబర్ అయినా, ఆధ్యాత్మికమైనది, వస్తు సంబంధమైనది (ఎవరికి కావలసింది వాళ్లకి) ఎక్కడ దొరుకుతుందో అక్కడ చేరతారు," వాళ్లనుంచి ఎడంగా నడుస్తూ అన్నాడు భాష్యం.

"ఈ గడ్డమీద ఏనాటిదో అయిన 'హిందూ' మతం మరే దేశంలోకి చొచ్చుకుపోయి స్థిరపడలేకపోయింది. దీనినుంచి ఆవిర్భవించిన బౌద్ధం మాత్రం దేశ సరిహద్దులు దాటి నలుదిశలా వ్యాపించింది, కొన్ని చోట్ల ఇంకా జీవిస్తోంది. దానికి మత ప్రచారం ఒకటే కారణం కాదు," కస్తూరి అన్నాడు.

"లోపాలున్నంత మాత్రాన ఏ మతం గొప్పది కాకపోదు, గొప్పదయినంత మాత్రాన లోపాలు ఉండకూడదని లేదు. కులవ్యవస్థ ఉన్నంత మాత్రాన హిందూమతం చెడ్డదయిపోలేదు. లోపాలు లేని మతం ఏది? ఏదన్నా గొప్ప మతం అయినంత మాత్రాన దాని లోపాల గురించి, దాన్ని అనుసరించే వాళ్లు పోయేటప్పుడు పోకడల గురించి మాట్లాడనీయకుండా ఫత్వాలు జారీ చేస్తే అది వాళ్ల మూర్ఖత్వాన్ని వాళ్లే బయటపెట్టుకున్నట్లవుతుంది. దేశంలో వందల సంవత్సరాలుగా బౌద్ధం నెలకొని, ప్రతిఘటనా శక్తి అంతంత మాత్రంగా ఉన్న జనాన్ని మరీ నిర్వీర్యం చేసింది, దాని నెగెటివ్ తత్త్వం, నిరాశావాదం నిర్లిప్తతకు దారితీసింది, పైనించి దాడిచేయని వాడిదే తప్పు, దోచుకోని వాడిదే పాపం, సోమరితనానికి నీరుపోసింది, వ్యవసాయం దెబ్బతిని, దానిమీద ఆధారపడి బతికే వాళ్ల సామాజిక విలువను దిగజార్చింది ఇవన్నీ పెద్దలు అన్న విషయాలే, వాటి మీద నాకు కాపీరైట్ లేదు," భాష్యం అన్నాడు.

లౌకిక ప్రపంచం దుఃఖభాజనమయినదని దానిపట్ల నిరాసక్తతను బోధించి ఈ చోటు వదిలిపోయారు భిక్షువులు. వాళ్ల బోధనలు నిరుపయోగమైపోయాయి. వాళ్లు ఈ లోకంలో జీవించటానికి అవసరమైన నీటి నిల్వకై కొండరాళ్లను తొలిచి ఏర్పాటు చేసుకున్న తొట్లు 2,200 సంవత్సరాలుగా చెక్కు చెదరకుండా ఉన్నాయి, నీటిని నిలువ వుంచుతూనే వున్నాయి. ఎవరు వాటిని వాడినా వాడకపోయినా.

కస్తూరి సముద్రం వైపు తిరిగి కొద్ది క్షణాలు కళ్లు మూసుకుని లెంపలేసుకున్నాడు. మస్తిష్కంలో సర్వసంగ పరిత్యాగి బుద్ధుడి సుందరరూపం ఊహించుకున్నాడు. 'చీకటి కాననంలో దివిటీ వెలుగును సరిగా ఉపయోగించుకోలేకపోయిన వాళ్లది తప్పు, దివిటీ వెలిగించి మార్గ నిర్దేశం చేసే మహాత్ములది కాదు," అనుకున్నాడు మనసులో.

అరగంట గడిపి, వెనక్కువచ్చి కారెక్కారు. కారు కొండదిగి తీరంరోడ్డు ఎక్కింది. ఎర్రమట్టి దిబ్బలకేసి పరుగెడుతోంది. మత్తు దిగినట్లుంది, ఉమ్మటం తగ్గించాడు డ్రైవరు. కుక్కలగుంపు అడ్డొచ్చింది. బ్రేకు వేశాడు. ఎన్ని కుక్కలున్నాయి!

"ఒక బొమిక గురించి ఎంతలా రక్తాలు కారేలా కొట్లాడుకుంటున్నాయ్," కస్తూరి ఆశ్చర్యపోయాడు ప్రపంచ వింతల్లో దేన్నో చూస్తున్నట్లు, కొట్లాటలను కుక్కలను ఎప్పుడూ చూడనట్లు.

"అందుకే గదా సార్ ఆటిని కుక్కలని పిలుస్తాం," డ్రైవరు స్వామి అన్నాడు.

అది మేధా సంబంధమైన చర్చకాదు కాబట్టి డ్రైవరు దాంట్లో పాల్గొన్నాడు. మనిషయి మాట్లాడకుండా, కుక్కయి మొరగకుండా వుండటం కష్టం. మేధావి అయితే నోటికి, చేతిరాతకి, మేధకు, (కొండకచో) కండకు, తరచు పనిబడుతుంది.

"మనుషులలో ఫలానా వారు అధికులు, ఫలానావారు అధములు అన్నట్లు, సృష్టిలోని మిగతా జీవులపట్ల కూడా సమదృష్టి లేదు మనకు. అన్ని జీవులూ ఒకటే అన్నింటిలోనూ నేను జీవిస్తుంటా అని తెలుపటానికి దేవుడు వివిధ జంతువుల రూపాల్లో వరాహం, కూర్మం, మత్స్యంగా అవతరించాడు. అన్ని జీవులను సమంగా చూడాలి శక్తిమంతుడు, బుద్ధికలవాడు అయిన మనిషి," హితవు పలికాడు కస్తూరి, కొంత స్వామిని కూడా ఉద్దేశించి.

## నీలగిరి చికిత్స

చిన్నప్పుడు జలుబు చేసినప్పుడో, దగ్గు ఎక్కువైనప్పుడో బామ్మలు నీలగిరి తైలాన్ని తమలపాకు మీద రాసి, కాస్త వెచ్చజేసి పొట్ట మీదో, గుండె మీదో వేసి కాసేపుంచడం మనకు గుర్తుంది. పచ్చ -పసుపు రంగుల కలయికతో వుంటుంది నీలగిరి తైలం. దగ్గు, కంఠం ఆర్చుకుపోవడం, ఊపిరితిత్తుల జబ్బులు, టైఫాయిడ్, అల్సర్లు, కడుపులో నులిపురుగులు, డిఫ్తీరియా, మలేరియా, పైల్స్‌కే కాక సుఖవ్యాధులైన సిఫిలిస్, గొనోరియా వంటి వాటికి కూడా ఉపశమనంగా పని చేస్తుంది నీలగిరి తైలం. ఆస్త్మా రోగులకు ఇన్‌హేలర్‌గా ఉపయోగపడుతుంది. ఇన్ఫెక్షన్లు, పయోరియా, కాలిన గాయాలు, జ్వరాలు, వాతరోగాలు, అజీర్ణానికి కూడా వాడుకోవచ్చు. చర్మం మీద రాసుకుంటే ఆర్థ్రైటిస్, వాపులు, రుమాటిజంలను ఉపశమింపజేస్తుంది. కీళ్ల నొప్పులకు రాసుకుంటే రాసిన చోట్ల రక్తప్రసరణను క్రమం చేసి వేడి పుట్టించి, తద్వారా నొప్పులను తగ్గిస్తుంది. తగిన మోతాదుల్లో మాత్రమే ఈ తైలాన్ని తీసుకోవాలి. లేకపోతే కండరాల బలహీనత, అజీర్ణం, వికారం, వాంతులు, డయేరియా కలుగుతాయంటున్నారు పరిశీలకులు.

ఎన్.

"అందుకేగా కస్తూరి, మనం ఆ జంతువు ఈ జంతువు అని చూడకుండా అన్నింటినీ సమదృష్టితో భుజిస్తున్నాం. కొరియనులు కుక్కల్ని, చైనీయులు కప్పలు పాముల్ని కూడా వదలరు".

"కనీసం, తినటంలో కూడా జంతువులను, పక్షులను సమంగా చూడటం లేదు కదా! గొడ్డు నీచమయినదన్నట్లు, ఆర్యులు గొడ్డుమాంసం తిన్నారని కొందరు ఎత్తిచూపటం, అలా అనటం ఆర్యజాతికి సంబంధించిన వాళ్లం! వాళ్లు అనుకుంటున్న అంటున్న వాళ్ల మనోభావాలు దెబ్బతింటాయనటం ఎందుకు జరుగుతోంది?"

"అసలు ఒక మనిషిని చూచి వీడు హూణ జాతివాడు, వీడు శకుడు, వీడు ఆర్యుడు అని నేడు చెప్పగలగటం ఎంతవరకు సాధ్యం? పరమ దుర్మార్గులైన శ్వేత హూణులు కూడా భారతీయ జనజీవన స్రవంతిలో కలిసిపోయారు అని గర్వంగా చెపుకుంటున్నప్పుడు, ఎవడు ఏ జాతివాడో తెలియటం ఎంతవరకు అవసరం?"

"అవసరమా, అనవసరమా అనికాక చరిత్ర నిజాలు తెలుసుకోవాలి అనుకోవటం వల్లనే ఆర్యుడు పై వాడా, మనవాడా అన్న గొప్పవాదన దేశంలో నేడు జరుగుతోంది."

"ఆర్యులు ఇక్కడివాళ్లే అని నిర్ధారణ అయినపుడు వేదాలు, వైదిక మతం 3500-4000 సంవత్సరాల కన్నా ప్రాచీనమైనవని ఒక వర్గం సంతోషిస్తుంది. పైవాళ్లే అని రుజువయినపుడు, ఆ రెండు అంతకుమించి ప్రాచీనమైనది కాదని రెండవవర్గం సంతృప్తి చెందుతుంది."

"వాళ్లు పై వాళ్లు కాబట్టే, వాళ్లు ఈ దేశ జనాభాలో కలిసిపోకుండా, వాళ్ల జాతి స్వచ్ఛతను, ఆధిక్యతను కాపాడుకోవటం గురించి కులవ్యవస్థ ఏర్పరిచారన్న భావన కొందరిలో వుంది".

"కులవ్యవస్థ సదుద్దేశంతో ఏర్పడిందా, దురుద్దేశంతో ఏర్పడిదా అన్న విషయం వదిలేస్తే, బ్యాక్టీరియాలా పెరిగిపోయిన కులాలు రాజకీయ, ఆర్థిక ఫలాలు దక్కించుకోవటానికి రేషను కార్డులయ్యాయి. కనీసం తమ తమ కులాల వల్ల నేడు లబ్ధి పొందుతున్నవాళ్లు కులవ్యవస్థను యీసడించుకోరు."

రోడ్డు పక్కన కారు ఆపాడు స్వామి. ఎందుకు ఆపాడో అర్థం కాలేదు.

"ఎర్రమట్టి దిబ్బలు," అన్నాడు రోడ్డుకు ఎడమవైపు చూపిస్తూ.

"అవేం చూస్తాం, డచ్ సమాధుల దగ్గరకి పోదాం," అన్నాడు భాష్యం.

"రోడ్డు పక్కనే గదండి, అయిదు నిముషాల్లో ఎల్లొచ్చేయ్యండి ఆటికంటే ఇయ్ బాగుంటయ్," స్వామి అన్నాడు.

దిగి, నాలుగడుగులు పశ్చిమంగా వేసేసరికి ఎర్రమట్టి దిబ్బలు ఆరంభమయినాయి. ఒకదాని కొకటి దగ్గిరగా, ఒకదానికొకటి దూరంగా ఉన్నాయి. అయినా ఉన్నతంగా, రాజసంగా, అందంగా ఉన్నాయి. ఏ ప్రకృతి వైపరీత్యం వలన ఆ నేలలో అలాంటి ఎత్తైన, ఎర్రటి, చిన్న చిన్న కొండలలాంటి మట్టి దిబ్బలు ఏర్పడ్డాయో. వేల, లక్షల సంవత్సరాలనాడు ఎర్రమట్టితో చేసి వదిలేసిన విగ్రహాల్లా ఉన్నాయి. వాటిమీద అడవి లతలు, మొక్కలు మొలచి ప్రేమగా అల్లుకుని అలంకారంగా ఉన్నాయి. ఎముకలు లేని, ఎత్తైన, చరిత్రపూర్వపు అనాది మనుషులను పోలివున్నాయి. చరిత్ర దూరాలకు కాలివేళ్ల మీద లేచి కుతూహలంగా తొంగిచూస్తున్న రెడ్ ఇండియన్‌లలా ఉన్నాయి. పొడవైన లోయ లోపలికి వ్యాపించి వుంది రహస్యాలను వేటినో కాపాడుతూ. మట్టి దిబ్బల మధ్య ఖాళీస్థలాలలో మొలచిన సరుగుడు మొక్కలు గాలికి ఊగుతూ దిబ్బలపై ఏదో అజమాయిషీ చేస్తున్నాయి.

రెండు చేతులతో నడుమును అటూ ఇటూ పట్టుకుని తల వెనక్కు వాల్చి పైకి చూస్తున్నాడు. భాష్యం, శిరసుపైకి దివినుంచి దూకబోయే గంగపై ఎదురు చూస్తున్న, సిద్ధమవుతున్న శివుడిలా. భాష్యం ఎర్ర టీ షర్టును రాంగ్లర్ బ్లూ జీన్స్‌లోకి టక్ చేశాడు.

"ఆకాశాన్ని చూస్తున్నావా, దిబ్బలని తనిఖీ చేస్తున్నావా?"

"ఆకాశ నీలం నేపథ్యంలో దిబ్బల ఎర్రదనాన్ని."

"వీటికి ఎర్రదనం ఎలా వచ్చిందో! నేల ఎర్రదే అయినా (ఇక్కడే కాదు, ఎక్కడైనా) పచ్చటి చెట్లు మొలుస్తాయి. అవి రంగురంగుల పూలు పూస్తాయి."

"ఈ నేలకు ఎర్రదనం ఎలా వచ్చిందో చరిత్ర చెబుతుంది."

"నీతో చెప్పి వుంటుంది! ఏమిటి?"

"రక్తంతో తడియడం వలన అని. తడి ఆరిపోయింది. ఎరుపు మిగిలిపోయింది. అయితే దాని స్వభావంలో మార్పు లేదు. మొలిచే చెట్లు అవి పూచే పూలేకాక, అల్లది (వేలితో పుట్టను చూపిస్తూ) కూడా స్వభావంలో మార్పు లేదని చెబుతున్నాయి", భాష్యం అన్నాడు.

వాళ్లకు నాలుగడుగుల దూరంలో పెద్దపుట్ట. అదీ ఎర్రగానే వుంది, అక్కడి మట్టితోనే దాని నిర్మాణం జరుగుతుండడం వలన. చూచే కళ్లను బట్టి అది భయం, విచారమే కాదు ఆకర్షణ కూడా కలిగిస్తోంది. అందులో ఏ పామో చేరే వుంటుంది. అయినా బారులు తీరిన చీమలు దాన్ని ఆకాశం తాకించటానికన్నట్లు నిర్మించుకుపోతున్నాయి. పుట్ట



## తేల్ మాలిశ్


అలసిన శరీరాన్ని ఉత్తేజపరచి, నూతనోత్సాహాన్ని కలిగించేది మసాజ్. ఇది కేరళీయుల వైద్యంగా అనాదిగా ప్రచారంలో వుంది. ఆయుర్వేదంలో కూడా దీన్ని న్యూరోథెరపీ అన్నారు. శరీరంలో నెలవేర్పరచుకున్న విషవాయువులను (టాక్సిన్లు) బయటికి పంపేందుకు మసాజ్ బాగా ఉపయోగపడుతుంది. 'శిరోధార' అనే మసాజ్‌లో గోరువెచ్చని నూనెను నుదుటిని బాగా పూస్తారు. దీని వల్ల నాడీమండలం రిలాక్సవుతుంది. మెదడు అదుపులో వుంటుంది. 'క్షీరధార' చికిత్సలో నూనెకు బదులుగా పాలను వాడుతారు. దీన్ని రక్తపుపోటును తగ్గించటానికి ఉపయోగిస్తారు. 'శిరోవస్తి'లోనైతే రకరకాల ఔషధగుణాలున్న తైలాలను ఓ కాప్‌లో నింపి దాన్ని తల మీద అరగంట పాటు వుంచుతారు. దీని వల్ల మైగ్రేన్, సైనస్, ముఖపక్షవాతం, చెవుడు ఉపశమిస్తాయి. మామూలు రిలాక్సేషన్‌కైతే మసాజ్ తరువాత ఆవిరి పడతారు. ఈ మసాజ్‌ను 21 నుంచి పాతిక రోజులు, రోజుకు అరగంట నుంచి ముప్పావు గంట దాకా వదలకుండా చేయించుకుంటేనే ఫలితాలు • కనిపిస్తాయి.

ఎస్.

## పిల్లలు బొటనవేలెందుకు చీకుతారు?

పిల్లలు వేళ్లు చీకటం మామూలు. నాలుగేళ్ల దాకా చీకినా అటు తరువాత వారంతట వారే మానేస్తుంటారు. ఇంకా మాట్లాడితే పదేళ్లకైనా పోతుందట. కానీ తల్లిదండ్రులు పిల్లలెందుకలా చేస్తున్నారో తెలుసుకోవాలి. తమతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడవకపోవటం వేళ్లు చీకటానికి ఒక కారణమంటున్నారు వైద్యులు. ఒకరే సంతానమున్న కుటుంబాల్లోని పిల్లలు కూడా ఇట్లా వేళ్లు చీకుతుంటారు. కొందరి ప్రకారం తల్లి దగ్గర పాలు సరిపోకపోతే కూడా వేళ్లు చీకుతారు. దీని వల్ల పిల్లలకు మానసికంగా సంతృప్తి కలుగుతుందో లేదో కానీ, పళ్లకు మాత్రం హాని కలుగుతుంది. ఎత్తు పళ్లు రావటం, పళ్ల మధ్య దూరం పెరగటం వంటివి జరుగుతాయి. పగలు పిల్లల పట్ల శ్రద్ధ తీసుకుని వారితో ఎక్కువ సమయం గడుపుతూ, ఈ అలవాటును మాన్పించవచ్చు. రాత్రి వేళల్లో కథలూ, పాటలూ వినిపిస్తూ మాన్పించవచ్చు. వేళ్లకు చేదు మందులు పూయటం, కాప్స్ తొడగటం వల్ల మానుతారు. వేళ్లు చీకటం మానితే కానుకలిస్తామని ఆశ పెట్టడం మరో దారి. ఇవన్నీ నాలుగేళ్ల పిల్లలకు. కానీ ఆరేళ్లు వచ్చినా వేళ్లు చీకటం మానకపోతే, సైకోథెరపీ ఇవ్వాల్సివుంటుందంటున్నారు వైద్యులు.

ఎన్.



శత్రువు పాలయినా అవేం చెయ్యలేవు, చెయ్యవు. పైపెచ్చు అది విశ్రమించటానికే ఇవి శ్రమిస్తున్నట్లున్నాయి. పుట్ట నిర్మాణంలో ప్రదర్శితమవుతున్న ఐక్యత పాము ఎదుర్కొనే విషయంలో కనబడటం లేదు. పిరికితనం వల్లనో, ఎలా జరగాలిసినది అలా జరగక మానదు అనుకోవటం వల్లనో.

"ఎవరి రక్తం చిందింది, ఎవరు చిందించారు?"

"ఘజనీ మహ్మద్, షా బుద్దీన్ ఘోరీ, తైమూరు, నాదిర్షా వగైరాలు. ఈ పేర్లు వినంగానే స్రవించిన రక్తం ఎవరిదో నీకు అర్థం అయి వుంటుంది."

"మనం ఉన్న గడ్డ కళింగం. కళింగ యుద్ధంలో లక్షమంది కళింగ వీరులు మరణించారు. అంతకు ఎన్నో రెట్లు ఇరుపక్షాల వాళ్లు నశించారు. జరిగిన రక్తపాతం చాలదన్నట్లు లక్షన్నర మందిని ఖైదీలుగా పట్టుకుపోయారు. దానిపై నీ తీర్పు?"

"జరిగిన రక్తపాతానికి ఎవరు విచారించరు? దానికి బాధ్యుడయిన వ్యక్తే కుమిలిపోయాడు."

'హింసకు పాల్పడిన వాడు, బాధితులు పరవాళ్లా మనవాళ్లా అన్న దాని మీదో కూడా విలువ తీర్పు ఆధారపడి ఉంటుంది."

"అశోకుడు బౌద్ధమతం పుచ్చుకుని, పశ్చాత్తాప పడి ప్రాయశ్చిత్తం చేసుకుని ఉండకపోతే అతని స్థానం చరిత్రలో వేరే విధంగా ఉండేది. ఘజనీ వగైరాలు భాషాజాలంలో పశ్చాత్తాపం అన్నమాట విన్నామా? కొల్లగొట్టుకు పోయిన దానిని తన ప్రజల సంక్షేమానికి వినియోగించిన దాఖలా లేదు. (ఒక్క ఘజనీ 18సార్లు దేశం మీదికి వచ్చి కొల్లగొట్టుకు పోతే నిరోధించగలిగిన వీరుడు ఈ వీరభూమి మీద లేకపోయాడు). సైనికుల రక్తమైతే చిందించదగినది అని అనకూడదు గాని. (కనీసం ఆయుధాలతో వాళ్లని వాళ్లు రక్షించుకోగలరు), అశోకుడి సేనలు చూపింది సామాన్య ప్రజానీకాన్ని కాదు. విలువ తీర్పు చెప్పేటప్పుడు ఆలోచించవలసిన విషయం మరొకటి వుంది. అశోకుడి హింస వెనుక రాజ్య విస్తరణ కాంక్ష వుంది, మిగతా వాళ్ల హింస వెనుక దోపిడీ దొంగ మనస్తత్వం, పచ్చినెత్తురు తాగే గుణాలు వున్నాయి. వాళ్లు చంపటం గురించే మనుషులను చంపారు. దారి తప్పి ఒక చెడ్డపని చేసిన మానవుడు అశోకుడు. చెడ్డపనులు పదే పదే చేసిన దానవులు మిగతావాళ్లు, వాళ్లు దారితప్పటం అంటూ లేదు, వాళ్లదారే అది కాబట్టి," భాష్యం అన్నాడు.

కళ్లజోడు తీసి రుమాలుతో తుడుచుకున్నాడు. కళ్లజోడుకు అలవాటుపడిన ముఖం వింతగా వుంది. తెరుచుకుని వున్నా కళ్లు దేన్నీ చూస్తున్నట్లు లేవు. భాష్యం చూపూ వేయి సంవత్సరాల వెనక్కు చూస్తోందా?

"అసలు యుద్ధాలు చేయని రాజులు ఎందరున్నారు? తూచా తప్పకుండా అహింసా మార్గాన్ని ఎన్నుకుంటే ఆ రాజు శత్రువుల బారినుంచి ప్రజలను తనను శత్రువుల బారినుంచి రక్షించుకోవటం సాధ్యపడదు. సైన్యాలు లేని రాజ్యాలుండవు. అలాంటి రాజ్యాన్ని భోజ్యంగా భావిస్తుంది పక్క రాజ్యం. హింస ఎంతమంది రాజులలో పరివర్తన తెచ్చింది అశోకుడిలోలాగ. అయితే కళింగ యుద్ధంలో జరిగిన జన నష్టం అంతకుముందు ఏ యుద్ధంలో జరిగివుండదు," భాష్యం.

"పిల్లలు, పెద్దలు కూడా ఎర్రమట్టి దిబ్బలు ఎక్కుతున్నారు. శిఖరాలు చేరటం అందరికీ ఇష్టం. ఏదో సాధించిన సంతృప్తి, గర్వం, మట్టి జారిపోతోంది. మనిషి రసదృష్టి సోకిన క్షణం నుంచీ వాటి పతనం ఆరంభమయివుంటుంది. ఆనందాన్ని విధ్వంస మాధ్యమంలోనే వ్యక్తం చెయ్యగలం. తూర్పునుంచి పడుతున్న ఎండను ఎర్రమట్టి దిబ్బలు అడ్డుతున్నాయి. వాటి నీడలు పడమట పడుతున్నాయి. ఎర్రమట్టి దిబ్బల నీడలు మాత్రం నల్లగానే ఉన్నాయి. నీడలు చూస్తూ మౌనంగా, అచేతనంగా నిలబడ్డాడు భాష్యం.

"ఇక వెళ్లి డచ్ సమాధులు చూద్దాం," కదులుతూ అన్నాడు కస్తూరి.

"ఘోరి, తైమూరు, నాదిర్షాల దాడులకు ఘజనీ దాడికి ఒక ముఖ్యమయిన తేడా వుంది దుర్మార్గంలో అన్నీ ఒకలాంటివే అయినా. 1026 వ సంవత్సరంలో మొదటిసారిగా దండయాత్రకొచ్చాడు ఘజని. వాడి రాకలు దోపిడీ హత్యలకు పరిమితం కాలేదు. అప్పటినుంచే బలవంతాన దేశ ప్రజానీకాన్ని ఇస్లాములోకి మార్చటం ఆరంభమయింది. ఆ చరిత్రనీడ నేటికీ దేశ సాంఘిక, రాజకీయ జీవనం మీద పడుతోంది. వేల సంవత్సరాలుగా ఉంటూ వచ్చిన అఖండ భారతం చీలిపోయింది, ఏదోరకమైన మతకల్లోలాలు కొనసాగుతూనే వున్నాయి," నడుస్తూ అన్నాడు భాష్యం.

కారు దగ్గరకి వచ్చేసరికి డ్రైవరు కనిపించలేదు.

"వీడూ ఏ మూలో కూర్చోనో, నిలుచునో ప్రకృతిని చూచి మైమరిచిపోయి వుంటాడు. వాడూ మనిషే. వాడికీ కాస్త కలాపోసన ఉండాలి," కస్తూరి అన్నాడు, అతనిది పాజిటివ్ దృక్పథం.

అతనికి ఎదురుగా నిలబడివున్న భాష్యం నవ్వుతున్నాడు, కస్తూరి భుజం మీదినుంచి ఎక్కడికో నాలుగుకళ్లతో చూస్తూ.

"ఏం భాష్యం భయ్, శతాబ్దాల ఉన్మాదం నీలో ప్రకోపించిందా?"

చూపుడు వేలితో కస్తూరి భుజం మీదినుంచి వెనక్కు చూపించాడు. వరుగుడు చెట్లలో నిలబడి సముద్రం వైపు తిరిగి లఘుశంక కానిస్తున్నాడు స్వామి. ఎవరు ఏ విధంగా ఎవరికి ఆనందం సిద్ధిస్తుందనుకుంటే ఆ మార్గాన్ని ఎన్నుకుంటారు.

డచ్ వారు భీమునిపట్నంలో, ఆంగ్లేయులు విశాఖపట్నంలో పదిహేడో శతాబ్దం మధ్యలో ఒకేసారి సెటిల్‌మెంట్లు ఏర్పరుచుకున్నారు. వింతైన విషయం ది డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ, ఆంగ్లేయులు ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా ఒకేసారి ఏర్పడ్డాయి 1602, 1600. ది డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఇక్కడ కోట, ఫ్యాక్టరీ నిర్మించుకున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లీషు వారు, డచ్‌వారు చేసుకున్న ఒక ఒప్పందం ప్రకారం, 1.6.1825న డచ్ కమీషనర్ ఆంగ్లేయులకు ఈ ఊరు అప్పగించాడు, అత్తసొమ్ము అల్లుడు ధారపోసినట్లు. 9.2.1861న ఈ ఊరును పురపాలక సంస్థ కిందికి తెచ్చారు.

ఒకానొకప్పుడు భీమునిపట్నం రేవు ద్వారా సముద్రవ్యాపారం విరివిగా సాగేది. ఆంగ్లేయుల, ఇతరుల నౌకలు వస్తూ పోతూ ఉండేవి. గోస్తనీ నది సముద్రంలో కలిసే చోట తరచూ ఇసుక మేట వేసేది. అది, నది నుంచి వచ్చే పడవలు సముద్రం మీది నౌకలను చేరటానికి అవాంతరంగా వుండేది. రేవు అధికారులు ఆ ఇసుకమేటను తొలగించి మార్గం ఏర్పరచేవారు. క్రమేపీ ఇతర ఇబ్బందులూ ఎదురై, నౌకలను విశాఖపట్నం రేవుకు మళ్లించివేశారు. భీమిలి రేవు సహజమరణం పాలైంది. ఊరు మాత్రం మరుగుజ్జుగా మిగిలిపోయింది.

అది దేశంలోనే రెండవ పురాతన పురపాలక సంస్థ అని, దక్షిణభారతంలో మొదటిదని, బ్రెజిల్ ఆఫ్ ది ఈస్ట్, పూర్ మెన్స్ ఊటి, పెన్షనర్స్ పేరడైజ్ అని గర్వపడటానికే గాని పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు అది ఎలాంటి ఎదుగుదలకు నోచుకోలేదు.

నవ్విన నాపచేన్లు పండుతాయి. భీమిలి విశాఖ బీచ్ రోడ్డు పొడవూ భూ కబ్జాలు విస్తారంగా జరిగివున్నాయని, అలాంటివి బలం కలవారే చేయగలరు కాబట్టిన్నీ, వడ్డించే ప్రభుత్వాలు వాళ్లవే అయివుంటాయి కాబట్టిన్నీ భీమిలిని ఏదోవిధంగా ప్రజాధనంతో అభివృద్ధి చేయించి, 'వాళ్ల' స్థలాలు ధరలు ఆకాశం వైపు పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయని నిత్యశంకితుల అభిప్రాయం.

నీతి: బలవంతులైన వారు భూ కబ్జాలు చేయటం వలన వెనుకబడిన ప్రాంతాలు ముందుకువస్తాయి.

ఈ ఊళ్లో సందర్శనీయ స్థలాలు (డచ్ సమాధులతోపాటు) భీముడు స్థాపించాడనే నృశింహదేవాలయం, జాన్ యంగ్ అనే ఆంగ్లేయుడు కానుకగా ఇచ్చిపోయిన గడియారాన్ని వుంచి కట్టిన టవరు, ఉపయోగం లేని లైట్‌హౌస్. ఒక్క దేవాలయం మినహా మిగతా వాటికి ముస్తాబులు చేశారు. దేవాలయం బాధ్యత దేవుడుకే వదిలేశాడు. ఇది దేవుడిమీద వాళ్ల భక్తి విశ్వాసాలను చాటుతుంది.

సమాధుల గేటుకు కాస్త ఇవతలిగా కారు ఆగింది. చెరొకవైపు నుంచి వాళ్లిద్దరు దిగారు. గోరీల దొడ్డి చుట్టూ ఎత్తుగా ప్రహారీగోడ కట్టి వుంది, ఆరు అడుగుల ఎత్తు గేటు పెట్టారు. లోపలివాళ్లు పారిపోకుండా కావచ్చు, బయటివాళ్లు లోపలివాళ్లతో కలిసిపోకుండా ఉండటం గురించైనా ఆ గేటు ప్రహారీగోడలు అమర్చి వుండవచ్చు. వేసిన గేటుకు అడ్డుగా చేపలు బుట్టలతో వివిధ వయసుల జాలారి స్త్రీలు కూర్చుని తీరుబడిగా మాట్లాడుకుంటూ సముద్రాన్ని చూస్తున్నారు. అది ఒక పెద్ద వలలా గాలికి అలలు అలలుగా కదులుతున్నట్లుంది దూరానికి. పురావస్తు శాఖవారు డచ్ సమాధుల వివరాలు రాయించి పెట్టారు.

డచ్ వారి 52 సమాధులు కొమ్మరిపాలెంలో, 15 భీమిలీ సముద్రతీరం (అంటే ఇక్కడ) ఉన్నాయి. వాటిమీద రాతి కప్పు వుంటుంది. ఈ 15 సమాధులలో అయిదింటిని అందమైన రాతలతో అలంకరించారు, అక్టోబరు 8వ తారీఖు, 1661 వ సంవత్సరంలో చనిపోయిన ఫెడరిక్ కెస్లరస్ అనే వ్యక్తి సమాధి ఈ ప్రాంతంలో అన్నిటికన్నా పురాతనమైనదిగా భావిస్తున్నారు. అది పిరమిడ్ ఆకారంలో కట్టినది.

భాష్యం చేపల బుట్టల దగ్గిరగా నడిచాడు. అతను సరుకుకొనడానికి వస్తున్నాడని ఆశ పడ్డట్లున్నారు ఆ స్త్రీలు.

"ఈ గేటు తాళం తీయటం లేదా?"


"నేదు బాబు".

"ఏం?"

"దొంగలు వొక సమాధి ఆ మద్దె తవ్వేసి దొరికినయి అట్టుకు పోయినారు. అందుకని తాలం జాగర్తగ ఏస్తన్నరు."

మిగతా 40వ పేజీలో....

## ఆంటీ-బయాటిక్స్ ఎలా తీసుకోవాలి?



ఇటీవల ఆంటీ-బయాటిక్స్ తీసుకోవటం బాగా పెరిగింది. కొన్నిటిని డాక్టర్లు భోజనానికి ముందూ, కొన్నిటిని భోజనంతో పాటూ, మరి కొన్నిటిని భోజనం తరువాతా తీసుకోమంటారు. ఖాళీ కడుపుతో తీసుకున్న ఆంటీ-బయాటిక్స్ జీర్ణం కావటం కష్టం కనుక ఆహారంతో పాటు తీసుకోవాలి. భోజనానికి ముందు తీసుకునేవి త్వరగా శరీరంలోకి చేరటం వల్ల జీర్ణవ్యవస్థ మీద వాటి ప్రభావం త్వరగా పడుతుంది. పళ్ల నొప్పులకు వాడే మెట్రానిడిజోల్ వంటి ఆంటీ-బయాటిక్స్‌ను తీసుకున్నాక మద్యపానం చేయకూడదు. మద్యపానంతో మందులలోని శక్తి పలుచబడి పని చేయవు. దీని వల్ల తలనొప్పి, వికారం, వాంతులు రావచ్చు కూడా. ఊపిరితిత్తుల జబ్బులకూ, మొటిమలకూ వాడే టెట్రాసైక్లిన్స్‌ను పాలు, అంటాసిడ్లు లేదా ఐరన్‌తో తీసుకోకూడదు. దీని వల్ల జీర్ణవ్యవస్థకు ఇబ్బంది కలుగుతుంది.

ఎస్.

...23వ పేజీ తరువాయి

"సమాధుల ఎలా చూడటం?"

"తాలం తీస్తే సూడొచ్చు బాబు."

"ఎవరి దగ్గిర వుంటుంది తాళం చెవి."

"ఆడాస్పత్రిలో"

"అడిగితే ఇస్తారా?"

"తెల్లుబాబూ. అడిగి సూడండి. ఆ యమ్మలు ఇస్తారో ఇయ్యరో. ఆయమ్మలిస్టం. ఇయి ఆల్లయి."

"చేపలు అమ్మకానికేనా?"

"అమ్మకానికి కాకపోతే దేనికి బాబు తట్టలేట్టుకుని సమాధులదగ్గిర కూకోటం".

"ఎలా అమ్ముతున్నారు?"

"పదిరూపాయలకి అయిదు," చెప్పిందొకామె చేపను చూపిస్తూ. ఏడెనిమిదంగుళాలుందది.

"చేపలు కొనటానికొచ్చామా, సమాధులు చూడటానికొచ్చామా?" దూరంగా వెళ్లిన కస్తూరి అరిచారు.

"మత్స్యావతారానికి నమస్కరించక దూరంగా పోతావేం?" మందలించాడు భాష్యం.

డ్రైవరు నవ్వాడు. తాళం తెచ్చిపెట్టమని అతన్ని అడిగాడు భాష్యం. ఆడవాళ్ల మిషనరీ ఆస్పత్రికేసి వెళ్లాడు స్వామి.


కమ్యూనిటీ హాలు అన్నపేరుతో సమాధుల ప్రహరీ గోడను ఆనుకుని కట్టిన బిల్డింగు మెట్లెక్కి పై అంతస్తు చేరారు. నలుగురయిదుగురు నిద్రపోతున్నారు. అదృష్టవంతులు, నిద్ర ఏ వేళనైనా పడుతుంది వీళ్లకు. పట్టాల్సినవేళకూడా నాకు పట్టిచావదు అనుకున్నాడు భాష్యం. నిద్ర రానివాళ్లు చుట్టలు తాగుతున్నారు సముద్రాన్ని పరికిస్తూ. జీవితాన్ని ఆనందించడం అవసరమైన, అసలైన కళ. అక్కడి కళాకారులను మనస్ఫూర్తిగా అభినందించాడు భాష్యం. చుట్టలు తాగితే ఉమ్ములొస్తాయి. ఉమ్ములను ఎంతోసేపు నోటిలోనే ఉంచుకోటం సాధ్యపడని విషయం. ఉమ్మేయటమనే సాధ్యపడేపని జరుగుతోంది. కొంతసేపు పైనుంచి, దూరంనుంచి సమాధులను చూచి కిందికి దిగి వచ్చేశారు.

వేసివున్న ఇనుపబద్దల గేటు దగ్గరకి వెళ్లి ఇవతలినుంచి కంతలగుండా లోపలికి చూస్తూ నిలబడ్డాడు భాష్యం, పీపింగ్ టాంలా.

లోపల ఏ అద్భుత శృంగార దృశ్యం లేదు. చనిపోయిన చావు అదృశ్యంగా, తన ఉనికిని తెలియజేస్తోంది, సముద్ర ఘోషని నిరంతరం వింటూ, బతకటానికి, ఈ దేశం నాదా కాదా, నావాళ్ల మధ్య ఉన్నానా లేదా అన్న అంశాలు కావాలి. నేలలో కలిసి పోవటానికి ఏ భూ భాగమైతేనేం. తేడాలు మనుషులు పాటిస్తారు. కలిపేసుకునే భూమి పాటించదు.

గేటు దగ్గరగా వున్నవాళ్లవి 1960లో పోయిన వాళ్లవి. వాళ్లు డచ్‌వారు కాదు. అక్కడి మిషనరీకి చెందినవాళ్లు. ఉత్తరాభిముఖంగా ఉన్న సమాధుల దొడ్డి వెనుకగా, అంటే దక్షిణంగా ఉన్నవి వందల సంవత్సరాలనాడు కాలం చెల్లిన డచ్ వారివి. ప్రేమపూర్వకంగా వాళ్ల భార్యలో, పిల్లలో, బంధువులో కట్టించినవి కాకపోవచ్చు. తాజ్మహల్‌లా ప్రజాధనంతో దారిద్ర్యం నడుమ పాలరాతితో రెండు దశాబ్దాల పైబడి కట్టినవి మాత్రం కాదు. దిక్కుమాలిన చోట పేదజాలర్లు చేపలమ్ముకునే చోట, కొద్దిగంటలలో పేద తాపీ మేస్త్రీలు కట్టినవి.

స్వామి కనిపించాడు వస్తూ. "రా... రా... స్వామి రా...రా," అనిపాడాడు కస్తూరి. మొత్తం



మీద స్వామి వచ్చాడు ఉమ్ముకుంటూ.

"తెచ్చావా?" సుఖశాంతుల గురించి అడిగినట్లు అడిగాడు భాష్యం.

"తేలేదు!"

"ఏం?"

"ఆల్లియ్యలేదు."

"ఎందుకని?" కస్తూరి.

"వాచ్‌మన్ చెప్పేడు ఆల్లు ఇవ్వద్దన్నారని."

"అరిగిపోతే తాళం చెవి దేనికీ పనికిరాదనా?" భాష్యం.

"గోరీలు, ఆటిమీది రాతలు సూసేదేంటని ఆ యమ్మలన్నారని ఆడన్నాడు."

"నువ్వేమనలేదా?" కస్తూరి.

"సదుంకున్నోళ్ల సరదాలయి, తాలం ఇయ్యదలుచుకోనప్పుడు ఆ ఊసులు ఆల్లకెందుకు, మనకెందుకు , అన్నాను."

"వాడేమన్నాడు?" కస్తూరి.

"తాలం ఆల్లది, గోరీలదొడ్డి ఆల్లది ఆల్లిస్టం అన్నాడు. ఈ ఊరు మనది కాదు. సమాదుల గురించి గొడవెందుకని వచ్చేశాను."

నిజానికి తాళం చెవి ఇపుడంత అవసరం కూడా లేదు. కాస్త దూరంనుంచి సమాధులను చూసేశారు కాబట్టి.

"ఆ గోరీలు విదేశీయులవి అందుకని విలువైనవి. తాళాలు వేసి ఉంచాలి. ఇదివరకు విదేశీయులు మనల్ని దోచుకునే వాళ్లు. ఇప్పుడు విదేశీయుల సమాధులని కూడా మనం దోచుకుంటున్నాం," భాష్యం అన్నాడు.

"ఏచోటనో పుట్టి ఉన్న ఊరు, దేశం, భార్యాపిల్లలు, బంధు జనం అందర్నీ వదులుకుని సముద్రానపడి వచ్చి ఈ దేశపు మారుమూల కన్నుమూశారు, 'కస్తూరి బాధపడ్డాడు శూన్యంలోకి చూస్తూ.

"మనదేశాన్ని ప్రేమించి అంతంత దూరాలనుంచి వచ్చి ఇక్కడ కన్నుమూశారు, తుది శ్వాస వదిలారు. వాళ్లు మన అతిథులు, దేవుళ్లు. ఎవరినైనా ప్రేమించే జాతి మనది, సరిహద్దుల అవతలినుంచి రావాలే గాని ప్లేగునైనా," భాష్యం అన్నాడు నిర్వికారంగా.

"గతు చేదుతనాన్ని మరిచిపోకపోతే వర్తమానం రుచించదు, భాష్యం."

"ఏరి తల్లీ నిరుడు వచ్చిన ఘజనీ ఘోరీలు, బాబర్ ఖైవులు," అని పాడి "ఈ డచ్ సమాధులు చూడటం కూడా అట్లాంటి నోస్టాలజిక్ సెంటిమెంటే," అన్నాడు భాష్యం.

"ఘనకార్యాలు చేసికాక, ప్రకృతి వైపరీత్యానికి తట్టుకుని 340 సంవత్సరాలు నిలువ గలిగిన సమాధులవలన ఆ డచ్‌వాళ్లు చరిత్రకెక్కారు. వాళ్లు పుట్టినదేశంలో వాళ్ల జ్ఞాపకాలు, ఆనవాళ్లు మిగిలి వుండవు," కస్తూరి అన్నాడు.

"గుర్తుండిపోయే మంచి వలనగాని, చెడ్డవలన గానీ, దానికి సంబంధించిన వ్యక్తులు చరిత్రకు ఎక్కుతుంటారు. ఆ కోవకు చెందకుండా గూడా చరిత్రలో నిలిచిపోవచ్చు," భాష్యం అన్నాడు.

అతను చరిత్రలో రేపు గుర్తుండిపోడు, అతను కన్నుమూస్తే ఖననం చేస్తారు. ■